RNI No - APTEL/2022/81596

# జనోదయ

janodaya

కరీంనగర్ బుధవారం 18.02.2026 సంపుటి : 03 సంచిక :75 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar wednesday 18.02.2026 Volume: 03 Issue 75 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా


6లో..

## 9 నెలల్లో ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్

**సమగ్ర మాస్టర్ ప్లాన్-2047 కోసం గ్లోబల్ టెండర్లు**

**మార్చి 16న టెండర్లు ఓపెన్**


7లో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ సమగ్ర మాస్టర్ ప్లాన్ 9 నెలల్లో సిద్ధం కానుంది. ఇందుకు సంబంధించిన పక్రియను ప్రభుత్వం మొదలుపెట్టింది.

# ఆత్మహత్యకు ప్రేరేపించడం నేరమే

### సినీ నటి ప్రత్యూష కేసులో సిద్ధార్థరెడ్డికి రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసిన సుప్రీం

**విషం కొనుగోలు ముమ్మాటికీ తప్పే**

**సిద్ధార్థరెడ్డి 4 వారాల్లో లొంగిపోవాలి**

**హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు**


7లో..

కలసి చనిపోదామనే ఒప్పందం(మ్యూచువల్ సూసైడ్ ప్యాక్ట్)లో బతికి ఉన్న వాళ్లు దోషులేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఇద్దరూ కలిసి ఆత్మహత్యకు యత్నించినప్పుడు అందులో ఒకరు ప్రాణాలతో బయటపడితే.. అది ఆ వ్యక్తి చేసిన నేరంగానే పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. సినీ నటి ప్రత్యూష కేసులో ఆమె స్నేహితుడైన సిద్ధార్థ రెడ్డే స్వయంగా విష పదార్థం కొనుగోలు చేసినట్లు తేలిందని, అతడు ముమ్మాటికీ దోషేనని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. 24 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన సినీనటి ప్రత్యూష కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీం ధర్మాసనం.. నిందితుడు సిద్ధార్థ రెడ్డికి రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని సిద్ధార్థరెడ్డిని ఆదేశించింది.



### కోర్టు ధిక్కరణపై

## హైకోర్టు ఆగ్రహం..

**కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష..!**



కోర్టు ఆదేశాలను ధిక్కరించినందుకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు జైలు శిక్ష పడింది. ఉద్దేశపూర్వకంగా కోర్టు ధిక్కరణకు పాల్పడినందున ఆయనకు హైకోర్టు 6 నెలల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధించింది. మంగళవారం విచారణ అనంతరం కలెక్టర్‌కు జైలు శిక్ష విధిస్తున్నట్లు హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. అప్పీలు సుకోవడానికి కలెక్టర్‌కు 4 వారాల గడువు ఇచ్చింది.బోనాల్ గ్రామవాసి లక్ష్మి వేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. భూ వివాదంలో కోర్టు ఆదేశాలను కలెక్టర్ పట్టించుకోలేదని ఆమె పిటిషన్ వేసింది. లక్ష్మి పిటిషన్‌పై విచారించిన హైకోర్టు.. కలెక్టర్ రాహుల్ రాజ్ తీరును తప్పుపట్టింది. కోర్టు ఆదేశాను ధిక్కరించినందుకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా వేసింది. అప్పీల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిన హైకోర్టు.. తీర్పు అమలను నాలుగు వారాలు వాయిదా వేస్తున్నట్టు చెప్పింది.

### ఏప్రిల్‌లో ఐదు రాష్ట్రాల

## అసెంబ్లీ ఎన్నికలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** దేశంలో శాసనసభ పదవీ కాలం ముగియనున్న మరికొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి మధ్యలో ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం తెలిపారు. ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఐదు అసెంబ్లీల పదవీ కాలం మే, జూన్‌తో ముగుస్తున్నది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం అధికారులు పర్యటించి ఎన్నికల సంసిద్ధతను అంచనా వేశారు. ప్రస్తుతం ఒక బృందం అస్సాంలో పర్యటిస్తున్నది.

## అన్ని జోన్లలో పర్యటిస్తా..

**రోడ్లు శుభ్రంగా లేకపోతే సస్పెండ్ చేస్తా**

**.. సీఎం రేవంత్ వార్నింగ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17:** పురపాలక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు సీఎం. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్య మంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్



ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వటైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు.

### హైదరాబాద్‌ను

## లైఫ్ సైన్సెస్, ఫార్మా హబ్‌గా మార్చడమే లక్ష్యం

**మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17:** బయో ఆసియా 2026 సదస్సులో పారిశ్రామికవేత్తలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. టెక్నాలజీ ద్వారా బౌగోళిక, ఆర్థిక, రాజకీయ మార్పులకు అనుగుణంగా సదస్సు విజన్‌ను రూపొందించారన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలు.. ఏఐ టెక్నాలజీని వినియోగించుకుని ముందుకు వెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. హెల్త్ కేర్ సేవలను ప్రజలకు అందుబాటులో, అఫర్డబుల్‌గా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాలన్నదే తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ టార్గెట్ అని అన్నారు. రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కొందరు పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా తెలంగాణలో సేవలు అందిస్తున్న నోవార్టిస్ కంపెనీని ముఖ్యమంత్రి అభినందించారన్నారు.మార్పులకు అనుగుణంగా లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగంలో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌ను లైఫ్ సైన్సెస్, ఫార్మా హబ్‌గా మార్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జినోమ్ వ్యాలీ ఫేజ్ 4ను 100 ఎకరాలతో విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. అత్యాధునిక మౌలిక వసతులతో జీనోమ్ వ్యాలీ ఫేజ్ 4 ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.2035 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల



పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కొత్తగా 5 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఉత్పత్తి మాత్రమే కాకుండా కొత్త ఔషధాల పరిశోధన కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## త్వరలో జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా!

**కేంద్ర మంత్రి మేఘ్వాల్**

**శ్రీనగర్, ఫిబ్రవరి 17:** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించటంపై కేంద్రం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర న్యాయమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అన్నారు. శ్రీనగర్‌లోని ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాష్ట్ర హోదా పునరుద్ధరణ అనేది చాలా సున్నితమైన అంశమని, దీనిపై త్వరలో ఓ నిర్ణయం వెలువడుతుందని ఆయన అన్నారు.ఈ అంశంపై మంత్రి అమిత్ షా ఇప్పటికే లోక్‌సభలో స్పష్టమైన హామీ ఇచ్చారని, సరైన ప్రకియతో దీనిని చేపడతామని చెప్పారని మేఘ్వాల్ అన్నారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై సీఎం ఒమర్ అబ్దులా స్పందిస్తూ, రాష్ట్ర హోదాపై ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం నిరంతరం కేంద్రంతో టచ్‌లో ఉన్నదని, అయితే ఈ ప్రక్రియపై అనుకున్న దానికన్నా ఎక్కువ సమయం పట్టిందని ఆయన అన్నారు.



# రుజువుకాని నిందలు రాస్తే జైలుకే

## నింద వేరు..సద్విమర్శ వేరు



కే.ఆర్ 'శైలి' పాత్రికేయ పాఠశాల
పాఠం 18.02.2026

**తన పరువు తీసిన పత్రికా విలేకరిపై పౌరుడు పరువు నష్టం దావా వేయవచ్చు.తీవ్రమైన విమర్శలుంటే క్రిమినల్ కేసు కూడా నడపవచ్చు.ఇండియన్ పీనల్ కోడ్ ఐపిసిలోని 499, 500 సెక్షన్‌ల ప్రకారం ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవచ్చు.జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు.**

### పరువు నష్టం అంటే..

సమర్థించడానికి వీలులేని తప్పుడు నిందలతో పరువు తీయడాన్ని పరువు నష్టం అంటారు. పౌరుడి హోదాని తగ్గించి, కించపరిచి, అందరిలో నవ్వుల పాలు చేసి, హేళనకు, వ్యతిరేకతకు, శత్రు భావానికి గురిచేసి, అతని వృత్తి వ్యాపారాల్లో నష్టం కలిగించే రచనను పరువు నష్టం రచనగా పరిగణిస్తారు. నోటిమాటతో నిందించడాన్ని 'శ్లాండర్' అని, రాత పూర్వకంగా లేదా అచ్చు రూపంలో నిందించడాన్ని 'లిబెల్' అంటారు. ఈ రెండింటిని క్రిమినల్ పరువు నష్టం నేరాలుగానే భారతీయ శిక్షా స్మృతి పరిగణించింది. పత్రికల్లో రాయడం అంటే లక్షలాది ప్రతుల ద్వారా అందరికి తమ రచనలు చేరవేయడమనే అర్థం. కావున ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. తప్పుడు నేరారోపణలు చేయడం, నిందించడం పరువు నష్టం కల్గించడానికి ఉదాహరణలు. దీన్ని అపకీర్తి, పరువు నష్టం, అప్రతిష్ట అని అంటారు. సమాజంలో ఏహ్యతకు, అవహేళనకు గురిచేసి అతను చెడ్డ వ్యక్తి అని భావించేందుకు అవకాశం కలిగించి, అతని హోదాలో, వృత్తి వ్యాపారాల్లో నష్టం కల్గించే విధంగా చెడు నడతను, దుర్లక్షణాలను ఆపాదించే ప్రకటనలు, ప్రచారాలు చేయడం పరువు నష్టానికి మరికొన్ని ఉదాహరణలు. ఈ విధంగా పరువు తీస్తే సివిల్ కోర్టుల్లో దావా వేయవచ్చు. క్రిమినల్ కోర్టులో ఫిర్యాదు చేయవచ్చు. ప్రత్యక్షంగాని పరోక్షంగా కానీ పరువు తీసే వార్తలు రాయవచ్చు.పైకి అమాయకంగా కనిపించే పదాల వెనక నింద దాగి ఉంచే రచనలను ఇంగ్లీషులో 'ఇన్యుయెండో' అంటారు. అతను సాక్షాత్తు హరిశ్చంద్రుడు అంటే దానికి వ్యతిరేకార్థం వస్తుంది. పరోక్షంగా కూడా పరువు తీసే హక్కు ఎవరికీ లేదు. పరువు తీసే రచనలు ప్రచురించిన తర్వాత కూడా పత్రికలకు కొన్ని రక్షణలు ఉంటాయి..నిజం చెప్పడం వల్ల ఎవరికైనా పరువు నష్టం జరిగితే అది తప్పు కాదు. నిజం పూర్తి రక్షణ ఇస్తుంది. హత్య చేసిన వాడిని హంతకుడు అనడంలో తప్పులేదు. ప్రజలకు మేలు చేసే నిజాలు కొందరి పరువు తీసేవే అయినా నష్టం లేదు. వ్యాపారవేత్త దివాలా తీశాడని రాయడం తీవ్రస్థాయిలో పరువు నష్టం కలిగించే రచన అవుతుంది. అయితే ఇలాంటి సందర్భాలలో సదరు వ్యాపారవేత్త తనకు ఆస్తుల కన్నా అప్పులు ఎక్కువగా ఉన్నాయంటూ కోర్టులో దరఖాస్తు ఇన్‌సాల్వెంట్ పిటిషన్(ఐపి) పెట్టుకుంటే దివాలా తీశాడని అనడానికి అంతకన్నా రుజువు అవసరం లేదు.ఈ నిజం రాయడం అతని పరువు తీసినట్లు కాదు. భహిరంగ సభలో ఎవరినైనా తిడుతూ ప్రసంగించడం పరువు నష్టం కిందకే వస్తుంది. ఇలాంటి ప్రసంగాలపై వార్తలు రాసినప్పుడు విలేకరులు జాగ్రత్తగా రిపోర్టు చేయాలి. పరుష పదజాలంతో ఆయన ప్రసంగం సాగిందని వదిలేయడం మంచిది. ఆ తిట్లన్నీ పత్రికలకు ఎక్కిస్తే పరువు నష్టం కలిగించే పదాలకు అనవసర ప్రచురణ, ప్రాచుర్యం కల్పించి తప్పు చేసినట్లవుతుంది. విలేకరి నేతల తిట్లను రాసి పత్రికలో ప్రచురిస్తే తిట్టిన వ్యక్తితోపాటు, పరువు నష్టానికి పాల్పడినందుకు విలేకరి కూడా పరిహారం చెల్లించాల్సిందే.దురదృష్టవశాత్తు నేడు అగ్రశ్రేణి పత్రికలుగా చెప్పుకుంటున్న చాలా పత్రికలు కనీసం జర్నలిజం కట్టుబాట్లను పాటించడంలేదు. సీఎం ప్రతిపక్ష నేతలను అనరాని మాటలతో బూతుల పర్వం విప్పితే అదే భాషతో తాటికాయంత శీర్షికలతో ఆ బూతులను యథాతథంగా ప్రచురిస్తున్నారు.ఇటీవల ఓ ఎంపీ కేటీఆర్‌ని డ్రగ్ విషయంపై విమర్శిస్తే యథాతథంగా ఆ వార్తని ఓ పత్రిక ప్రచురించిన విషయం తెల్సిందే.ఈ వ్యవహారంలో కేటీఆర్ సదరు పత్రికకు పరువు నష్టం నోటీసులు పంపించిన విషయం తెల్సిందే. అదేవిధంగా ముఖ్యమంత్రిని కూడా ప్రతిపక్ష నేతలు రాయగూడని భాషలో తిట్లదండకాలు అందుకునే సందర్భంలో పత్రికలు ఆ తిట్లదండకాలను కనీసం ఎడిట్ చేయకుండా అలానే ప్రచురిస్తున్న విషయం ఆందోళన కల్గిస్తోంది.ఇక గ్రామంలో పుకార్లు వ్యాపించాయంటూ పుకార్ల పేరిట నిందలను రాయడం న్యాయం కాదు. పుకారు ఉన్న మాట వాస్తవమే అయినా పుకారులో ఉన్న నింద నిజం కాదు కనుక విలేకరి తప్పుచేసినట్లే అవుతుంది. 'పుల్లయ్యను వెంకట రావు కొట్టి చంపాడు అని సుబ్బయ్య చెప్పాడు' అని వార్త రాసినప్పుడు సుబ్యయ్య ఆ మాట చెప్పినాడని రుజువు చేసినంత మాత్రాన సరిపోదు. నిజంగా పుల్లయ్యను వెంకట రావు కొట్టాడా? లేదా? అన్నది రుజువు చేయాల్సి ఉంటుంది. వెంకటరావు కొట్టలేదని తేలిన పక్షంలో సుబ్బయ్యతోపాటు విలేకరి కూడా నేరం చేసినట్లు అవుతుంది. విలేకరుల సమావేశానికి కూడా ఇది వర్తిస్తుంది. విలేకరుల సమావేశంలో ఫలానా మాటలు చెప్పాడని రుజువు చేస్తే సరిపోదు. ఆ మాటల్లో ఉన్న నిందలు నిజాలా? కాదా? అన్నది ముఖ్యం. సర్పంచ్ 50 వేలు సంపాదించాడు అనే మాట రుజువు కావాలి కానీ ఉప సర్పంచ్ అన్నాడని రుజువైతే సరిపోదు. సర్పంచ్ నిర్దోషి అని రుజువైన పక్షంలో ఉప సర్పంచ్‌తోపాటు ఆయచ చెప్పిన మాటలను ప్రచురించిన పత్రికలు, వాటి సంపాదకులు, ప్రచురణ కర్తలు, విలేకరులు కూడా బాధ్యులవుతారు. విలేకరి తప్పుడు రాత రాయడం వల్ల తాను ఒక్కడు కాదు, సంపాదకుడు, పబ్లిషర్, ప్రింటర్ కూడా బాధ్యుడవుతాడు.

### సద్విమర్శ చేయవచ్చు

సద్విమర్శ, సమంజసమైన వ్యాఖ్య చేసే హక్కు విలేకరులకు ఉంది. మంచి ఉద్దేశంతో విమర్శించే రచనలకు కూడా ఆస్కారం లేకపోతే మంచీ చెడు వివరించే వారుండరు. ప్రభుత్వ అధికారులు కానీ, ప్రైవేటు సంస్థలు కానీ , రాజకీయ నాయకుల పనుల మంచీ చెడులను విశ్లేషించడం ప్రజలకు తెలియజేయడం విలేకరుల బాధ్యత. కొన్నిసార్లు నిశితంగా విమర్శించడం వల్ల బాధ్యులైన వారి పరువు పోతుంది. కానీ అది సద్విమర్శ అయినప్పుడు నేరం కాదు. నష్టపరిహారం ఇచ్చే పని ఉండదు. అయితే ఎవరినైనా విమర్శించే ముందు వ్యక్తిగతంగా నిందలు చేయకుండా వారు ప్రజలకు సంబంధించిన వ్యవహారాలను విశ్లేషించవల్సి ఉంటుంది.అప్పుడే ఫెయిర్ కామెంట్ ( సద్విమర్శ) అవుతుంది. విమర్శించడం స్వేచ్ఛలో భాగమైతే నిందించడం నేరమవుతుంది. ద్వేషంతో చేసే రచన కువిమర్శ అవుతుంది. సదుద్దేశంతో చేసే విమర్శ సద్విమర్శ అవుతుంది.

ఉదాహరణకు..' సర్పంచ్ పదవికి నారాయణ అనర్హుడు..అతను నిజానికి చప్రాసీ పదవికి కూడా పనికి రాడు.ఇదివరకు ఇతను బడిలో పనిచేసేటప్పుడు చాక్‌పీస్‌లు, డస్టర్లు దొంగతనం చేశాడు. ఇటువంటి దొంగలు సర్పంచ్‌లు అయితే ఊళ్లు దోచుకుంటారు' ఇందులో ఉన్నది సద్విమర్శ కాదు. కువిమర్శ. నింద,నేరారోపణ ఉంది. చప్రాసీ పనికి కూడా పనికి రాడనడం ద్వేషాన్ని సూచిస్తోంది. చాక్‌పీస్‌లు,డస్టర్లు దొంగతనం రుజువు కాకపోతే క్రిమినల్ నేరమవుతుంది.ఆ దొంగతనం మాట నిజమే అయినా దాని చుట్టూ చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదు. కుంభకోణాల ఆరోపణలు, ప్రజాధనం దుర్వినియోగం, టెండర్ల అక్రమాలు, లంచగొండితనం, అక్రమ సంబంధాల ఆరోపణల గురించి రాసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి. అన్ని వివరాలు, ఆధారాలు ఉన్నా సరే..నేరం రుజువైందనే ధోరణిలో వ్యాఖ్యానాలు చేయకూడదు. సాక్ష్యాలను ప్రజల ముందుంచి, తీర్పు పాఠకులకే వదిలేయాలి.ఈ పత్రాల్లో వెల్లడైన అక్రమాలు కాక ఆయన మరెన్నో అక్రమాలు చేశాడని అనుకుంటున్నారు అంటూ రాస్తే విలేకరి తన ముందున్న సాక్ష్యాధారాల పరిధిని దాటి వ్యాఖ్యానించినట్లే అవుతుంది. ఈ సాక్ష్యాలన్నీ నిజమే అయినా ఇతర అక్రమాలు రుజువయ్యే అవకాశమే లేదు. ఫలానా వ్యక్తి సభ్యసమాజానికి సిగ్గుచేటు, మానవజాతికి కళంకం వంటి వ్యాఖ్యలు తీవ్రమైన నిందలు.అవి రుజువయ్యే అవకాశం లేదు. వ్యక్తిగత విషయాలు, కుటుంబ విషయాల ఆధారంగా వార్తలు రాయడం సమంజసం కాదు.

..................................

**మానసాని కృష్ణారెడ్డి**
**9618616110**
**8074124190**

..................................

నోట్ : పాత్రికేయ పాఠశాలలో పరోక్ష తరగతుల ద్వారా పాత్రికేయులకు శిక్షణ కోర్సులు ఉన్నాయి. వివరాలకు సంప్రదించండి.8074124190

..................................




# అంతర్జాతీయ వేదికపై భారత పతాకం రెపరెపలు

**అబుదాబిలో ఓపెన్ మాస్టర్స్ క్రీడల్లో రెండు బంగారు పతకాలు**

**3000 మీటర్లు, 1500 మీటర్ల పరుగుల్లో సత్తా చాటిన డాక్టర్ కొలన్ జగజ్జీవన్ రెడ్డి**

**జనోదయ : శేరిలింగంపల్లి:** ప్రపంచ దేశాల మధ్య జరుగుతున్న ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీల్లో నిలబడటం ఒక్కటే పెద్ద సవాలు కాగా, అందులోనే రెండు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించడం అరుదైన ఘనతగా నిలుస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబిలో ఎమిరేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ మాస్టర్స్ గేమ్స్–2026లో భారతదేశానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ డాక్టర్ కొలన్ జగజ్జీవన్ రెడ్డి 3000 మీటర్లు, 1500 మీటర్ల పరుగు పందాల్లో మొదటి స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఫిబ్రవరి 6న ప్రారంభమైన ఈ క్రీడా మహోత్సవంలో 148 దేశాలకు చెందిన సుమారు 27 వేల మంది క్రీడాకారులు పాల్గొనగా, తీవ్ర పోటీ మధ్య ఆయన ప్రదర్శించిన పటుదల, స్థైర్యం ప్రత్యేకంగా నిలిచింది.

గత విజయాల జాడలోనే కొత్త రికార్డు: ఇప్పటికే 2024లో అమెరికాలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ఆయన, అదే ఆత్మవిశ్వాసంతో అబుదాబి వేదికపై మరోసారి ప్రతిభ చాటుతూ దేశానికి కీర్తి తీసుకువచ్చారు. ్ర దేశ గౌరవమే లక్ష్యం: భారత పతాకం ఎగురవేయడం ప్రతి క్రీడాకారుడి కల కాగా, స్వర్ణ



పతకాలతో దేశానికి గౌరవం తేవడం గర్వకారణమని డాక్టర్ జగజ్జీవన్ రెడ్డి పేర్కొన్నారు; రాబోయే రోజుల్లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించి దేశ ప్రతిష్ఠను మరింత పెంచాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

# మామిడిగట్టులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు

**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 17:**



మండలంలోని మామిడిగట్టు గ్రామపంచాయతీలో నూతనంగా ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ ను గ్రామ సర్పంచ్ సుంకరి దివ్య – సతీష్ ప్రారంభించారు. మంగళవారం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా బిగించిన సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లోని బల్బులు కాలిపోవడంతో గ్రామంలో రాత్రి వేళ వీధిదీపాలు పనిచేయక చిమ్మ చీకటి నెలకొంటుందని, తద్వారా గ్రామస్తులు ఇళ్ల నుండి బయటకు వెళ్ళలేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఇబ్బందులను తొలగించేం దుకు సెంట్రల్ లైటింగ్ లో పాడైన బల్బుల స్థానంలో నూతన బల్బులను ఏర్పా టు చేసి సెంట్రల్ లైటింగ్ ను అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## నవ్విపోదురుగాక మనకేంటి?

# తిట్టుకుందాం...రా

“ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత” అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మాట్లాడిన రేవంత్ రెడ్డికి మంగళవారం కేసీఆర్ జన్మదినోత్సవ సందర్భంగా అదే భాషలో కౌంటర్ ఇచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.





### నీది అరెయ్ భాష..
### నాది సన్నాసి విమర్శ

- ఎవనికి రా..జాతిపిత అనే రేవంత్ విమర్శలకు అరె సన్నాసి అంటూ కేటీఆర్ నోటికి పదును
- నేతల అరెయ్ భాషకు కొన్ని మీడియాల హైప్
- ఏపీ రాజకీయం బాటలో తెలంగాణ పాలిట్రిక్స్



కె.ఆర్ ఉన్నమాట

## హద్దులు దాటుతున్న మాటలు

“ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత” అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మాట్లాడిన రేవంత్ రెడ్డికి మంగళవారం కేసీఆర్ జన్మదినోత్సవ సందర్భంగా అదే భాషలో కౌంటర్ ఇచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. “ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత?” అని అడిగిన సన్నాసికి ఇవన్నీ చెప్తా ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి ఫైటర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతి’గుర్తుపెట్టుకో.. కొంతమంది మాట్లాడుతున్నారు ఆనవాళ్లు చెరిపేస్తామని.దాన్ని ఎట్లా చెరిపేస్తావురా సన్నాసి..? నువ్వు మమ్మల్ని ఎన్ని తిట్టినా, ఎన్ని బూతులు మాట్లాడినా ఒకటి మాత్రం వాస్తవం.. ఆయన ఒక శిఖరం, నువ్వు ఒక శునకం. నీ స్థాయి గదే, నీ బతుకు గదే. అంటూ కేటీఆర్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపైన విరుచుకుపడ్డారు.ఇలా ఓ సీఎంని పట్టుకుని అరెయ్.. ఒరేయ్..సన్నాసి.. శునకం అంటూ కేటీఆర్ మాట్లాడిన భాష పూర్తిగా అభ్యంతరకరం.గతంలో కూడా కేటీఆర్ తన నోటికి పలుమార్లు పదునుపెట్టడం తెల్సిందే.అయితే గడిచిన ఎన్నికల్లో ఇలాంటి మాటతీరు..కేటీఆర్ అహంకార వైఖరితోనే కారు పల్టీకొట్టిందనే విషయాన్ని మరువరాదు.కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో తన ప్రసంగాల్లో హద్దులు మీరి భాషను ఉపయోగించేవారు.ఆ విమర్శలు సత్ఫలితాలు ఇవ్వడం కన్నా నష్టాన్ని తెచ్చిపెట్టిన విషయాన్ని కేటీఆర్ గుర్తించి రానురాను తనలో రాజకీయ పరిపక్వత పెంచుకుంటూ వచ్చారు.గడిచిన ఎన్నికల్లో జరిగిన నష్టాన్ని కేటీఆర్ గుర్తెరిగి తన మాటల తీరును,తన వ్యవహారశైలిని మార్చుకుంటూ ఆకాశం నుంచి దిగి కోటరీలు..భజనపరుల భజనల నుంచి బయటపడి క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేస్తూ ప్రజలకు,కార్యకర్తలకు దగ్గర అవుతున్నట్లుగా కన్పించింది.అయితే అదంతా వట్టిదేనని నేడు తేలిపోయింది. ఎవరికి రా..నువ్వు జాతిపితవు అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌తోపాటు ప్రభుత్వానికి తీరని డ్యామేజ్ చేసిన విషయం తెల్సిందే.రేవంత్ మాట్లాడిన తీరుపైన తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే తెలంగాణ సీఎం రేవంత్ మైకు ముందట ఉంటే సీఎం అనే విషయాన్ని మరచి ప్రతిపక్ష నేతగా మారిపోతుంటారనే విమర్శ ఉంది.తన రాజకీయ ఎదుగుదల తన నోటితోనే ముడిపడి ఉందని రేవంత్ రెడ్డి బలంగా నమ్ముతున్నట్లు ఉంది.ఎన్ని విమర్శలు వచ్చినా ఆయన వెనక్కి తగ్గడం లేదు.అదే భాష, అవే అదుపులేని విమర్శలు.దీంతో ఆయన తన ప్రతిష్టనే కాదు సీఎం కుర్చీ హెూదానే దిగజార్చుతున్నారనే ఆరోపణలు స్వంత పార్టీ నుంచే బలంగా ఉన్నాయి.ఎవరెన్ని విధాలుగా అనుకున్నా రేవంత్ మాత్రం కేసీఆర్ విషయంలో అదే భాషను వాడుతుండటం దురదృష్టకరం.కేసీఆర్‌పైన విమర్శలు చేసే క్రమంలో విద్వేషపూరితమే ఉంది తప్ప ప్రజలు హర్షించేలా రేవంత్ వ్యాఖ్యలు ఉండటంలేదన్నది నూటికి నూరుశాతం నిజం.ఇదిలా ఉంటే కేటీఆర్ మళ్ళీ మంగళవారం తన నోటికి పదును పెట్టడం గమనార్హం.ఓ రాష్ట్ర సీఎంని పట్టుకుని సన్నాసి.. అరెయ్..ఒరేయ్..నీ బతుకు..శునకం అంటూ పూర్తిగా దిగజారిన భాషను ఉపయోగించడం దారుణం.ఇలాంటి వ్యవహారంతో అటు సీఎం రేవంత్ రెడ్డి ఇటు కేటీఆర్ ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు.బాధ్యత కల నేతల నోటి నుంచి వచ్చే ప్రతీ మాట సమాజంపై ప్రభావం చూపుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి మాటలు.. విమర్శలు..బూతులతో అక్కడ రాజకీయం పూర్తిగా దిగజారింది.ఇప్పుడు తెలంగాణలో కూడా ఇలాంటి రాజకీయాన్నే బాధ్యత కల నేతలు ఎన్నుకోవడం సిగ్గుచేటు.విమర్శలు చేయడం అంటే బూతులు తిట్టడం కాదనే సత్యాన్ని నేతలు గమనంలోకి తీసుకోవడం లేదు.ఇది ఇలా ఉంటే ఈ నేతలు ఉపయోగించిన బూతులను కొన్ని అగ్రశ్రేణి పత్రికలు యథాతథంగా తాటికాయంత శీర్షికలతో ప్రచురిస్తుండం ఇంకో దగుల్బాజీ వ్యవహారం.కనీసం నేతల బూతు పర్వాన్ని ఎడిట్ చేయకుండా..దొంగ అంటే దొంగ..లుచ్చా అంటే లుచ్చా అనే హెడ్డింగులతో సమాజాన్ని భ్రష్టుపట్టించే కార్యక్రమాన్ని కొన్ని మీడియాలు చేస్తున్నాయి. దురదృష్టవశాత్తు ఇలాంటి దగుల్బాజీ మీడియాలకే అక్రిడేషన్లు..కోట్లాది రూపాయల ప్రకటనలు ఇస్తూ రాజకీయ పార్టీలు పెంచిపోస్తున్నాయి.అందుకే ఈ జాడ్యం రోజురోజుకు ముదురుతోంది.ఇలా బూతుల పర్వాన్నే రాజకీయ ఎదుగుదలకు మార్గం అనుకునే నేతలను, అలాంటి రాజకీయ నేతలకు కొమ్ముకాస్తూ అగ్రశ్రేణి మీడియాలుగా చెలామణి అవుతున్న మీడియాలను పాతరేస్తేనే సమాజానికి మేలు.ఇటీవల కోవా బన్ విషయంలో ఓ చిరు వ్యాపారిని ఓ యూట్యూబ్ మీడియా ఎలా వేధించిందో చూశాం.సదరు మీడియా వ్యవహారశైలిపై ప్రజల్లో ఎలా తిరుగుబాటు వచ్చిందో చూశాం.ఇప్పుడు కూడా ఇలాంటి మురికి భాషను ఉపయోగిస్తున్న నేతలు..ఆ మురికి భాషను యథాతథంగా ప్రచురిస్తున్న మీడియాలను కూడా ప్రజలు తిరస్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఆ దిశగా ప్రజలంతా ఆలోచించాల్సిన సమయం ఇదే..

....................

మానసాని కృష్ణారెడ్డి
9618616110

---

## ఘనంగా కేసీఆర్ 72వ జన్మదిన వేడుకలు

**-బాలాజీ నగర్ సర్కిల్ వద్ద కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కేతిరి రాజశేఖర్, బీఆర్ఎస్ శ్రేణులు**

**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)**



భారత రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 72వ జన్మదిన వేడుకల సందర్భంగా మంగళవారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కేతిరి రాజశేఖర్ ఆధ్వర్యంలో 14వ డివిజన్ బాలాజీ నగర్ జంక్షన్ లో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు కేతిరి రాజశేఖర్ మాట్లాడుతూ.. కెసిఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, రాష్ట్ర ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రిగా ఆయన ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి బిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంద్రాతి భాస్కర్, ముడుసు నరసింహ, పత్రి సుభాష్, పత్రి రాజ పోశాలు, పున్నం ప్రభాకర్, పస్తం యాదగిరి, వీరాచారి, భూక్య శంకర్, జంగం రాజు, కేతిరి సమ్మక్క, రంగరాజు విజయ, ఎండి సలీం, గుమలాపురం హైమావతి,



పసునూరి సరిత, కన్నం వినమాల, రాపర్తి శ్రీను, కొత్తపల్లి సునీల్, పస్తం నర్సింగం, పస్తం రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ రథయాత్ర

**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 17:**



సంత్ సేవాలాల్ మహారాజు జయంతి వేడుకలను ధర్మ జాగరణ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం ధర్మ జాగరణ సంస్థ ఆధ్వర్యంలో మండలం లోని పులిమడుగు,మందమర్రి (వి), కాసిపేట మండలంలోని మా మిడిగూడెం, ధర్మారం,సోమగూడెం తండాలలో సేవాలాల్ రథ యాత్ర నిర్వహించారు. రథ యాత్రకు మహిళలు మంగళ హారతు లతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ధర్మ జాగరణ జిల్లా ప్రముఖ్ ఇప్ప లచ్చయ్య మాట్లాడుతూ బంజారా సమాజానికి మార్గదర్శకుడు, హిందూ ధర్మ గొప్పతనాన్ని తెలియజేసిన గొప్ప మహానుభావుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. చిన్ననాటి నుండే జగదాంబ భక్తుడిగా నిలిచిన సేవాలాల్ మహారాజ్ గోవుల సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చారని, బంజారా జాతిని ఆపదల నుంచి రక్షించేందుకు పాటించాల్సిన ఆచారాలు, పూజించాల్సిన దేవతల గురించి దేశమంతా తిరిగి ప్రచారం చేశాడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్ర మంలో సేవాలాల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజకుమార్, ధర్మజా గరణ మండల ప్రముఖులు రామటెంకి పోశం,పైడిమల్ల అరుణ్ కుమార్, కుప్పాల శ్రీనివాస్, సంకూరి శ్రీనివాస్ సదానందం, సర్పంచులు పాల్గొన్నారు.

## మోడీ వాణిజ్య ఒప్పందాలతో

# దేశీయ రైతుల దివాలా

**-రైతాంగ ఐక్య ఉద్యమాల బలోపేతానికై వరంగల్‌లో జాతీయ మహాసభలు**

**-ఏఐకేఎఫ్ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశంలో**

**-ప్రొఫెసర్ వినాయక రెడ్డి, కూరపాటి వెంకటనారాయణ, డాక్టర్ కె వీరస్వామి**

**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ ) ఫిబ్రవరి 17**

పాలకుల రైతు వ్యతిరేక వినాశనకర విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త రైతాంగ ఐక్య ఉద్యమాలను ఉధృతం చేసేందుకు మే 12, 13, 14 తేదీల్లో వరంగల్‌లో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక (టిఎస్డిఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీరస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జాతీయ రైతు మహాసభల జయప్రదానికై ఆహ్వాన సంఘం సమావేశం ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య అధ్యక్షతన వరంగల్ చార్బొలిలోని నోబుల్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వినాయక రెడ్డి, కూరపాటి వెంకటనారాయణ, డాక్టర్ వీరస్వామి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల పేరుతో దేశీయ రైతులను దివాలా తీయించి కార్పొరేట్ పెట్టుబడుదారులకు అమెరికన్ సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి వెన్నుముక అయిన వ్యవసాయ రంగంపై సుమారు 70 శాతం మంది ప్రజానికం ఆధారపడి జీవిస్తున్న కేంద్ర బడ్జెట్ లో మాత్రం కేవలం మూడు శాతం మాత్రమే నిధులు కేటాయించడం రైతుల వ్యవసాయంపై కేంద్రానికి ఉన్న ప్రేమ ఎలాంటిదో అర్థమవుతుందని అన్నారు. పంటలు పండించడానికి కావాల్సిన విత్తనాలు ఎరువులు పురుగుమందులు యంత్రాలు ధరలు విపరీతంగా పెంచి రైతులు పండించిన పంటలకు మాత్రం కనీస మద్దతు ధర చట్టం చేయకుండా నష్టపోయే విధంగా మార్కెట్ వ్యవస్థను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ.. చారిత్రాత్మక ఢిల్లీ రైతాంగ ఉద్యమం ఎంతో స్ఫూర్తిదాయకమని అలాంటి రైతాంగ ఉద్యమాల నిర్మాణం కోసం ఉత్పత్తి ఖర్చులు తగ్గించాలని దేశవ్యాప్త పోరాటాలను నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ క్రమంలో రైతాంగాన్ని రాజకీయాలకతీతంగా ఐక్యం చేసేందుకు ఉత్తర భారత దేశంలోని జమ్మూరి కిసాన్ సభ (జే కే






ఎస్) మరియు అఖిలభారత రైతు సమైక్య (ఏఐకేఎఫ్) ఐక్యమవడానికి మే 12, 13, 14 తేదీల్లో పోరాటాల గడ్డ వరంగల్లో జాతీయ రైతు మహాసభలను నిర్వహించడం ఎంతో హర్షించదగినవని ఈ మహాసభల జయప్రదానికై రైతు శ్రేయోభిలాషులు, అన్ని వర్గాల ప్రజానికం రాజకీయాలకతీతంగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐకేఎఫ్ జాతీయ నాయకులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ఇంచార్జ్ గాదగోని రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, కోశాధికారి గుండెబోయిన చంద్రయ్య, రాష్ట్ర నాయకులు కుసుంబ బాబురావు, తుకారాం నాయక్, ఎండి ఇస్మాయిల్, నాగెల్లి కొమరయ్య, సింగతి మల్లికార్జున్, ప్రజా సంఘాల రాష్ట్ర కార్యదర్శులు గోనె కుమారస్వామి, నర్ర ప్రతాప్, వంగల రాగసుధ, కర్ర రాజిరెడ్డి, గడ్డం నాగార్జున, కుంభం సుకన్య, మంద రవి, మాలోత్ సాగర్, సుంచు జగదీశ్వర్, కనకం సంధ్య, నేల రవీందర్, మాస్ సావిత్రి, పోతు కంటి కాశి, కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందం, మాలోత్ ప్రత్యూష, మహమ్మద్ మెహబూబ్, భాష, గనిపాక ఓదేలు, ఐతం నాగేష్, పరిమళ గోవర్ధన్, రాజు, చుక్క ప్రశాంత్ పాల్గొన్నారు.

# ఘనంగా కేసీఆర్ 72వ జయంతి

**భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు - నిరుపేదలకు దుప్పట్లు, విద్యార్థులకు ఫీజుల సహాయం**

**జనోదయ, హనుమకొండ, ఫిబ్రవరి 17:** తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ముఖ్య మంత్రి కె. చంద్రశేఖర్ రావు 72వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో బీఆర్ఎస్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు..మొదటగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ గోత్ర నామాలతో కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు చేశారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయం ఎదుట ఉన్న నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసి మానవతా సందేశం చాటారు. తదుపరి బాలసముద్రంలోని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సమక్షంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. ఈ సందర్భంగా ఇద్దరు నిరుపేద విద్యార్థుల ఫీజులను చెల్లించి రశీదులను అందజేశారు. దివ్యాంగులు నిర్వహించిన ప్రత్యేక



కార్యక్రమంలో కూడా నాయకులు పాల్గొని వారిని అభినందించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, "ముమ్మాటికీ కేసీఆర్ తెలంగాణ జాతిపిత. 60 ఏళ్ల గోస తీర్చిన ఉద్యమ కెరటం ఆయనే. 14 ఏళ్ల స్వరాష్ట్ర పోరాటం, 10 ఏళ్ల పాలనతో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకూ సంక్షేమం, అభివృద్ధి అందాయి" అని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భర్తపై కత్తితో దాడి చేసిన భార్య

### - భర్త మృతి -

**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 17:**



భర్తపై భార్య కత్తితో దాడి చేసి చంపిన ఘటన పట్టణం లోని శాంతినగర్ లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శాంతి నగర్‌కు చెందిన ఎండి మోయిన్ ( 42) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 10 సం,,ల క్రితం చుక్కల అవంతిని మతాంతర వివాహం చేసుకోగా వీరిద్దరి మధ్య తరచూ డబ్బుల విషయంలో చాలా రోజుల నుండి గొడవ జరుగుతుంది. మంగళవారం తెల్లవారు జామున మృతుని భార్య అవంతి తన భర్త మెడ పై కత్తితో పలుమార్లు దాడి చేయడంతో బాధితునికి తీవ్ర రక్తస్రావమైంది. దాడి ఘటన సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్సై జి నరేష్ ఘటన స్థలానికి చేరుకొని కొన ఊపిరితో ఉన్న బాధితుడిని 108 అంబులెన్స్ సహాయంతో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి ఎండి ఫైజియా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి నరేష్ తెలిపారు.

---

## ఆహార నాణ్యత ప్రమాణాలపై

# తనిఖీలు నిర్వహించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**జనోదయ,హనుమకొండ, ఫిబ్రవరి 17:**



జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హోటల్స్, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, హాస్టల్స్‌పై ఆహార నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసేలా సంయుక్త తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి తదితరులతో కలిసి కలెక్టర్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, పౌర సరఫరాలు, జిల్లా పంచాయతీ, మిషన్ భగీరథ, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని హోటల్స్, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, హాస్టల్స్‌పై ఫుడ్ సేఫ్టీ మరియు మున్సిపల్ అధికారుల సంయుక్త బృందాలతో వారానికి కనీసం మూడు రోజులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి వారాంతంలో తనిఖీల వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు.ఆహార పదార్థాల నాణ్యత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ అఫ్ ఇండియా ) నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనేది క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్సులు, ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ లైసెన్సులు చెల్లు బాటు అయ్యేలా ఉన్నాయా లేదా అనేది తనిఖీ చేయాలని అన్నారు.హోటల్స్, హాస్టల్స్‌లో ఉపయోగించే తాగునీరు, ఆర్ఓ వాటర్ ప్లాంట్ల పనితీరును తరచుగా తనిఖీ చేయాలని, అవసరమైతే నీటి నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించాలని సూచించారు. ఆహార పదార్థాలతో పాటు వంటగదులు, నిల్వ గదులు, పరిసరాల పరి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆహార పదార్థాలు విక్రయించే స్ట్రీట్ వెండర్లు తప్పనిసరిగా అనుమతులు, లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా హోటల్స్, తినుబండార కేంద్రాలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, అవసరమైతే ఆహార నమూనాలను పరీక్షలకు పంపాలని ఆదేశించారు.ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆహార నాణ్యతపై రాజీ ఉండకూడదని, నిబంధనలు పాటించని యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, డీఈవో గిరిరాజ్ గౌడ్, డిసిఎస్ఓ వాజిద్ అలీ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

---

# నార్కోటిక్స్, గంజాయి నిల్వ కేంద్రం కోసం స్థల పరిశీలన

### త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని ఆదేశం

**జనోదయ,డి హీరేహాళ్,అనంతపురం**



అనంతపురం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలోని ఎఆర్ ప్రధాన కార్యాలయం (స్వాధీనం చేసుకున్న గంజాయి నిల్వ స్థానం) వద్ద మంగళవారం నార్కోటిక్స్, గంజాయి నిల్వ కేంద్రం కోసం జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ జడ్జి జస్టిస్ ఈ.భీమారావు, మొదటి అదనపు జిల్లా జడ్జి మరియు నార్కోటిక్ డ్రగ్స్ కోర్టు జడ్జి సి.సత్యవాణి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు స్థల పరిశీలన చేశారు. త్వరితగతిన నార్కోటిక్స్, గంజాయి నిల్వ కేంద్రం కోసం స్థల పరిశీలన సర్వే పూర్తి చేయాలని మండల సర్వేయర్, ఆర్. అండ్.బి ఎస్ఈ, తదితర శాఖల అధికారులకు జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ జడ్జి, జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి నీలకంటేశ్వర్ రెడ్డి, డిటిసి డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, డిసిఆర్బి సిఐ వలీ భాష, ఆర్ఐలు మధు, పవన్ కుమార్ ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, తహసీల్దార్ మోహన్ కుమార్, నగరపాలక సంస్థ ఈఈ షాకీర్, మండల సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

---

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ): ఫిబ్రవరి 17**

తెలంగాణ రథసారధి, మాజీ ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ జన్మదిన సందర్భంగా రామన్నపేట బొడ్రాయి వద్ద కెసిఆర్ పేరు మీద పూజలు నిర్వహించి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తాళ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ మరియు స్కూల్ పిల్లలకు బిస్కెట్లు చాక్లెట్లు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛన ప్రత్యేక రాష్ట్రం సాధించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి మాజీ కేసీఆర్ అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని సుభిక్షంగా పరిపాలించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ 29వ డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, సీనియర్ నాయకులు రాచర్ల రాము, గట్టు చందు, రాచర్ల జగన్, పూజారి కుమారస్వామి, ముప్ప కాంతయ్య, మాల్వరాజు, సూరం గోపి, పూజారి సారంగం, మైదం కరుణాకర్, గొర్రె అరుణ్, మార్త కిరణ్, జావిద్, చిట్టిమల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

---

### ఘనంగా

## శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

### ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**జనోదయ,ఉమ్మడి ఆదిలాబాద్ :**

ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రేమల గార్డెన్‌లో శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్, 287వ జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి , జిల్లా కలెక్టర్ హరిత ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని, సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మహిళలతో నృత్యం చేసారు అనంతరం సేవాలాల్ మహారాజ్ బోధనలను, సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ వేడుకలో వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ప్రేమల గార్డెన్ ఆధ్యాత్మిక శోభతో సంతరించుకుంది.

## ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

**జనోదయ మందమర్రి ఫిబ్రవరి 17:**



మనస్తాపంతో ఇంట్లో ఇనుప రాడ్‌కు చున్నీతో ఉరి వేసుకొని బంగారి పావని (24) వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని విద్యానగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామానికి చెందిన మృతురాలికి 6 సం,, క్రితం పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన బంగారు సతీష్ తో వివాహం కాగా వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. భర్తతో గొడవల మూలంగా గత రెండు సం,,గా మృతురాలు తన కూతురు,కుమారుడితో కలసి తన తల్లి దగ్గర నివసిస్తుంది. ఈ క్రమంలో తన స్నేహితుడు ఠాకూర్ సంగ్రామ్ సింగ్ తో చనువుగా ఉంటూ ఇద్దరు పెళ్లి చేసుకునేందుకు నిర్ణయించుకొని గత 15 రోజులుగా పట్టణంలోని విద్యానగర్‌లో నివసిస్తున్నారు .మృతురాలు,స్నేహితునితో కలిసి గత 4 రోజుల క్రితం తన తల్లి దగ్గరికి వెళ్లగా, మీ పిల్లలను తీసుకు వెళ్ళాలని తల్లి కోరడంతో సంగ్రామ్ సింగ్ ఒప్పుకోక పోవడంతో మృతురాలు తీవ్రంగా మానసిక వేదనకు గురయింది. ఈ క్రమంలో సంగ్రామ్ సింగ్ మంగళవారం పని నిమిత్తం ఇంటి నుండి బయటకు వెళ్లగా, ఇంట్లో ఇనుప రాడ్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి తోకల ముత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

# క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా

**-వరుసగా రెండో రోజు వాయిదా**

**-రాళ్ళ దాడిలో మంత్రి వివేక్ కారు ధ్వంసం**

**-కోరం ఉన్న చైర్మన్ ఎన్నిక వాయిదా**

**-చైర్మన్ ఎన్నిక జరపాలని బీఆర్ఎస్, సీపీఐ సభ్యుల నిరసన**



**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 17:**

ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వరుసగా రెండో రోజు క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక వాయిదా పడింది. తొలి రోజు కోరం లేక ఎన్నిక వాయిదా పడగా మంగళ వారం కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థులు సమావేశానికి హాజరైనప్పటికీ ఉద్రిక్తత వాతావరణం నేపథ్యంలో మంగళవారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను వాయిదా వేశారు. సోమవారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగాల్సి ఉన్నప్పటికీ సభ్యులు హాజరు కాక పోవడంతో కోరం లేక వాయిదా వేసిన అధికారులు, మంగళవారం అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ క్రమంలో ఎక్స్ అఫిషియో ఓటు వేసేందుకు ఎంపీ వంశీ కృష్ణ, మంత్రి వివేక్ వస్తుండగా మంత్రి కాన్వాయ్‌పై రాళ్ళ దాడి జరగడంతో ఒక్క సారి పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. అటూ బిఆర్ఎస్ పార్టీ తరుపున క్యాతనపల్లి మున్సి పాలిటీ ఇంచార్జ్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ రావడంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఒకరి పై ఒకరు రాళ్ళ వర్షం కురిపించారు. పోలీసులు లాఠీ ఛార్జీ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కమిషనరేట్ పరిధిలోని డీసీపీ, ఏసిపిలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. ఈ దాడుల్లో జైపూర్ ఏసిపి గన్ మెన్‌కు ,కానిస్టేబుల్స్, కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రులకు తరలించారు.

**వెళ్ళి పోయిన మంత్రి వివేక్, ఎంపీ వంశీ కృష్ణ**


క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక జరుగుతున్న సమయంలోనే ఎక్స్ అఫిషియా ఓటు వేయడానికి వచ్చిన ఎమ్మెల్యే, ఎంపీలు సమావేశం నుండి నేరుగా బయటకు వెళ్ళిపోయారు.

**వాయిదా పడిన ఎన్నిక**

రెండో రోజు సమావేశానికి కోరం ఉండగా చైర్మన్ ఎన్నిక సహావుగా సాగుతుందని ఆశించినప్పటికీ సమావేశంలో సభ్యులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో తప్పని సరి పరిస్థితుల్లో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల ప్రత్యేకాధికారి మండల తహసీల్దార్ సతీష్ కుమార్ శర్మ తెలిపారు.

**ఎన్నిక నిర్వహించాలని బిఆర్ఎస్ సిపిఐ సభ్యుల నిరసన**

మున్సిపల్ పాలక మండల సభ్యుల సమావేశంలో ఘోరం ఉన్నప్పటికీ అధికారులు కావాలనే ఎన్నికను వాయిదా వేశారని బిఆర్ ఎస్ సిపిఐ సభ్యులు ఆరోపించారు. అధికారుల తీరును వ్యతిరేకంగా కార్యాలయంలో



లోపల నిరసన వ్యక్తం చేశారు. చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికకు కోరం ఉన్నప్పటికీ అధికారులు మంత్రి మెప్పు కోసం ఎన్నిక వాయిదా వేశారని వారు ఆరోపించారు. చైర్మన్ ఎన్నికను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఎన్నికలు సజావుగా చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

# ఒక్క మున్సిపల్ కోసమేనా ఇంత దిగజారుడు

**మంత్రి,ఎంపీల ఆధ్వర్యంలోనే మహిళా కౌన్సిలర్లపై దాడి**

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ,ఎఐటియుసి రాష్ట్ర వాసిరెడ్డి సీతారామయ్య**

**జనోదయ, ఉమ్మడి ఆదిలాబాద్ :**

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్, సిపిఐ పార్టీ కూటమి ఆధ్వర్యంలో గెలుపొందిన అభ్యర్థులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కోరంకి సరిపడా మెజారిటీ ఉన్నాకూడా ఎందుకు వాయిదా వేశారని సోమవారం క్యాతనపల్లిలోని బాల్క సుమన్ ఇంట్లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక శాఖా మంత్రి వివేక్ వెంకట స్వామి, ఆయన కుమారుడు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ ఆధ్వర్యంలోనే కార్యాలయంలో ప్రమాణ స్వీకరణకు హాజరు అయిన బీఆర్ఎస్, సిపిఐ కూటమి మహిళా సభ్యులపైన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ సభ్యులు తాగొచ్చి ఇష్టానుసారంగా ప్రవర్తించడమే కాకుండా తీవ్ర అసభ్యంగా ప్రవర్తించారని,ప్రజా స్వామ్య బద్ధంగా ఎన్నికైన కౌన్సిలర్లని బెదిరింపులకు గురిచేస్తూ,భౌతిక దాడులకు పూనుకున్నారని,అక్కడే ఉన్న ఎన్నికల అధికారులు ,పోలీస్ లు సైతం కనీసం అడ్డుకో పోగా సినిమా చూస్తున్నట్లు చూశారని,ఇది ప్రజాస్వామ్యానికి ప్రజలకు తలదించుకునే చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.అసలు మెజారిటీ లేని మీకు చైర్మెన్ సీట్ ఎలావస్తుంది ప్రశ్నించారు.కేవలం ఒక్క మున్సిపల్ కౌన్సిల్ కోసం ఇంటా దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గు చేటని, మా ఆడ కూతుర్ల కంటే ఈ మున్సిపల్ సీట్ ఎక్కు వేమీ కాదని, పద్ధతిగా అడుక్కుంటే ఇచ్చేవాడనని అన్నారు.21 వార్డు మహిళా అభ్యర్థిని కిడ్నాప్ చేశారని అధికారులను తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేశారనీ,జిల్లా అధికార యంత్రాంగతోపాటు,ఇక్కడ ఉన్న అధికారులు, పోలీస్‌లు సైతం కాంగ్రెస్ పార్టీ గుండాలుగా వ్యవహరిస్తున్నారని, ఒక్క మంత్రికి ఇంత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని,అధికారులకు సైతం సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లా అధికారుల చర్యలకు, కార్మిక మంత్రి దిగజారుడు రాజకీయాలకు, కాంగ్రెస్ నాయకుల గుండా గిరికి నిరసనగా బీఆర్ఎస్, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ పట్టణం సంపూర్ణ బందుకు పిలుపు నిస్తున్నామని,ఈ సందర్భంగా పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.ఎ ఐ టి యు సి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతా రామ య్య,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేనశంకర్ మాట్లాడుతూ సిపిఐ చరిత్ర కలిగిన పార్టీ అని,అమ్ముడు పోయే పార్టీ కాదని, సిపిఐ కౌన్సిల ర్ సభ్యులను కాంగ్రెస్ గుండాలు కిడ్నాప్ చేయడానికి చాలా ప్రయ త్నాలు చేశారని సిపిఐ కౌన్సిలర్ సభ్యులు ముక్త కంఠంతో ఖండించా రని తెలిపారు.ఈ కార్యక్రమంలో గెలిచిన కూటమి సభ్యులు, బిఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కంబ గోని సుదర్శన్ గౌడ్, చెన్నూరు నియోజక వర్గం సీనియర్ నాయకులు రాజా రమేష్, మాజీ కౌన్సిలర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ సద్గురు జంబణ్ణ తాత రథోత్సవం

## భారీగా తరలిన భక్త జనసందోహం

**జనోదయ :డి. హీరేహాళ్**

మండలంలోని పులకుర్తి గ్రామంలో వెలసినటువంటి శ్రీ సద్గురు జంబణ్ణ తాత రథోత్సవం మంగళ వారం నాడు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆనవాయితీగా ఈ రథోత్సవ కార్యక్రమాన్ని మహాశివ రాత్రి సందర్భంగా నిర్వహిస్తారు ఈ సందర్భంగా రెండు రోజులపాటు ఆలయంలో ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మొదటిరోజు అయినటువంటి సోమవారం నాడు ఆలయ ప్రధానార్చకులు కె హెచ్ ఎం మల్లికార్జున స్వామి ఆలయ పెద్దలు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయంలో హోమం అలాగే స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, ఇతరత్రా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక సాయంకాలం ప్రత్యేకంగా స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు. రాత్రి నుండి తెల్లవారే వరకు వివిధ ప్రదేశాల నుండి వచ్చిన భక్తుల చేత భజన కార్యక్రమం నిర్వహించారు. ఇక మంగళవారం నాడు రథోత్సవం సందర్భంగా తెల్లవారుజామునే ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఉదయం నుండి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామి వారికి పూజా కార్యక్రమాలు చేపట్టారు. తిరిగి సాయంకాలం సద్గురు శ్రీజంబణ్ణ తాత రథాన్ని భక్తులు తెచ్చినటువంటి భారీ గజమాలతో అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డప్పు వాయిద్యాల నడుమ భారీ భక్తజన సందోహం నడుమ ఈ రథోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆంధ్ర కర్ణాటక తదితర ప్రాంతాల నుండి భక్తులు భారీ ఎత్తున రథోత్సవ కార్యక్రమానికి తరలిరావడం జరుగుతుంది రథోత్సవానికి వచ్చిన భక్తులకు అక్కడే ఆలయం వద్ద ఉచిత అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ సీఐ వెంకటరమణ ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



# ఆత్మహత్యకు ప్రేరేపించడం నేరమే

### సినీ నటి ప్రత్యూష కేసులో సిద్ధార్థరెడ్డికి రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసిన సుప్రీం

- విషం కొనుగోలు ముమ్మాటికీ తప్పే
- సిద్ధార్థరెడ్డి 4 వారాల్లో లొంగిపోవాలి
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు




**కలసి చనిపోదామనే ఒప్పందం(మ్యూచువల్ సూసైడ్ ప్యాక్ట్)లో బతికి ఉన్న వాళ్లు దోషులేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఇద్దరూ కలిసి ఆత్మహత్యకు యత్నించినప్పుడు అందులో ఒకరు ప్రాణాలతో బయటపడితే.. అది ఆ వ్యక్తి చేసిన నేరంగానే పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. సినీ నటి ప్రత్యూష కేసులో ఆమె స్నేహితుడైన సిద్ధార్థ రెడ్డే స్వయంగా విష పదార్థం కోనుగోలు చేసినట్లు తేలిందని, అతడు ముమ్మాటికీ దోషేనని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. 24 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన సినీనటి ప్రత్యూష కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీం ధర్మాసనం.. నిందితుడు సిద్ధార్థ రెడ్డికి రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని సిద్ధార్థరెడ్డిని ఆదేశించింది.**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 :** కలసి చనిపో దామనే ఒప్పందం (మ్యూచువల్ సూసైడ్ ప్యాక్ట్)లో బతికి ఉన్న వాళ్లు దోషులేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఇద్దరూ కలిసి ఆత్మహత్యకు యత్నించినప్పుడు అందులో ఒకరు ప్రాణాలతో బయటపడితే.. అది ఆ వ్యక్తి చేసిన నేరంగానే పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. సినీ నటి ప్రత్యూష కేసులో ఆమె స్నేహితుడైన సిద్ధార్థ రెడ్డే స్వయంగా విషపదార్థం కోనుగోలు చేసినట్లు తేలిందని, అతడు ముమ్మాటికీ దోషేనని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. 24 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన సినీ నటి ప్రత్యూష కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీం ధర్మాసనం.. నిందితుడు సిద్ధార్థ రెడ్డికి రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని సిద్ధార్థరెడ్డిని ఆదేశించింది. 2002 ఫిబ్రవరి 23న సినీనటి ప్రత్యూష, ఆమె స్నేహితుడు సిద్ధార్థ రెడ్డి కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు యత్నించారు. మరుసటి రోజు ప్రత్యూష మరణించగా, ఆస్పత్రిలో చికిత్స తర్వాత సిద్ధార్థ రెడ్డి కోలుకున్నాడు. ప్రత్యూష మృతిపై పలు అనుమానాలు రావడంతో అప్పటి ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. అప్పట్లో విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు.. 2004 ఫిబ్రవరి 23న సిద్ధార్థ రెడ్డిని దోషిగా తేల్చింది. ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు ఐపీసీ సెక్షన్ 306 కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించింది. ఆత్మహత్యాయత్నం చేసినందుకు ఐపీసీ సెక్షన్ 309 కింద మరో ఏడాది శిక్ష విధించింది.ట్రయల్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ సిద్ధార్థ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అదేక్రమంలో తన కుమార్తె మృతికి సిద్ధార్థ రెడ్డే కారణమని, అతడికి కఠిన శిక్ష విధించాలని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి కూడా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన అప్పటి ఉమ్మడి ఏపీ హైకోర్టు.. 2011 డిసెంబరు 28న తీర్పు వెలువరించింది. సిద్ధార్థ రెడ్డికి ట్రయల్ కోర్టు విధించిన 5 ఏళ్ల జైలు శిక్షను 2 ఏళ్లకు తగ్గించి, జరిమానాను రూ.50,000కు పెంచింది. ఈ తీర్పును సిద్ధార్థ రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. తనను నిర్దోషిగా ప్రకటించాలని అభ్యర్థించారు.

మరోవైపు.. తన కుమార్తె మరణానికి సిద్ధార్థ రెడ్డినే కారణమని, అతడికి యావజ్జీవ శిక్ష విధించాలని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి కూడా అదే ఏడాది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ రెండు పిటిషన్లను విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనం.. గత ఏడాది నవంబరులో తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం జస్టిస్ రాజేష్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరిస్తూ.. సిద్ధార్థరెడ్డికి రెండేళ్ల జైలు శిక్ష విధించడాన్ని సమర్థించింది.

# 9 నెలల్లో ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్

### సమగ్ర మాస్టర్ ప్లాన్-2047 కోసం గ్లోబల్ టెండర్లు మార్చి 16న టెండర్లు ఓపెన్



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ సమగ్ర మాస్టర్ ప్లాన్ 9 నెలల్లో సిద్ధం కానుంది. ఇందుకు సంబంధించిన పక్రియను ప్రభుత్వం మొదలుపెట్టింది. హైదరాబాద్ నగర శివార్లలోని ఆమన్‌గల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల్, మహేశ్వరం, మంచాల, యాచారం మండలాలల్లోని 74 గ్రామ పంచాయతీలు (56 రెవెన్యూ గ్రామాలు) పరిధిలోని 765.28 చ.కి.మీ ప్రాంతంలో ఫ్యూచర్ సిటీ అథార్టీని ఏర్పాటు చేసింది. ఫ్యూ చర్‌సిటీ పరిధిలో 1.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నాయి. ఇందులో దాదాపు 15వేల ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. మరో 15వేల ఎకరాల అటవీ ప్రాంతంలో నైట్‌సఫారీ ఇతర ఎకో టూరిజం, పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఫ్యూచర్‌సిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు సరికొత్త మాస్టర్ ప్లాన్‌ను కూడా ప్రభుత్వం రూపొందిస్తోంది. కోర్ ప్రాంతంలో అంటే 30వేల ఎకరాల్లో ప్రాథమిక మాస్టర్ ప్లాన్‌ను, డీపీఆర్ తయారీ బాధ్యతలను సింగపూర్‌కు చెందిన ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ సుర్బానా జూరంగ్ సంస్థకు అప్పగించింది. ఇపుడు తాజాగా మొత్తం ఫ్యూచర్ సిటీ అథార్టీ పరిధి అంటే 74 గ్రామ పంచాయతీల్లోని 765.28 చదరపు కిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్-2047ని రూపొందించేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా అర్హత కలిగిన కంపెనీల నుంచి ప్రతిపాదనలు కోరుతూ ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు పిలిచింది. భారత్ ఫ్యూచర్ సిటీ విజన్ అండ్ కాంప్రహెన్సీవ్ మాస్టర్ ప్లాన్-2047 కోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేసింది. ఆసక్తిగల పార్టీలు తమ ప్రతిపాదనలతో ముందుకు రావాలని నోటిఫికేషన్‌లో కోరింది. ఈ మేరకు ఈనెల 25 వరకు డాక్యుమెంటేషన్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. సాంకేతిక, ఆర్థిక బిడ్ల దాఖలుకు మార్చి 12న సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించింది. బిడ్లు మార్చి 16న తెరుస్తామని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం వెల్లడిం చింది. ఇదిలా ఉంటే మొత్తం ఈ పక్రియను 9నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.